బదిలీలు చేపట్టి, సమస్యలు పరిష్కరించండి

- డీపీవోను కలిసి జీపీ కార్యదర్శుల ఫెడరేషన్ నూతన కమిటీ


డీపీవోను కలిసి పుష్పగుచ్చం అందజేస్తున్న కార్యదర్శులు

నవతెలంగాణ-నిజామాబాద్

నూతనంగా ఎన్నికైన తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్(టీపీఎస్ఎఫ్) కమిటీ మంగళవారం కలెక్టరేట్‌లో డీపీవో తరుణ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కార్యదర్శుల బదిలీలు చేపట్టాలని కోరారు. అదే విధంగా రెగ్యులర్ అయిన పంచాయతీ కార్యదర్శులు పనిచేసిన ఐదేండ్ల కాలాన్ని సర్వీసు కాలంగా పరిగణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సుమన్, ప్రధాన సెక్రటరీ శ్రావణ్, సెక్రటరీ పెద్ది బాలకృష్ణ, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

పాముకాటుతో చిన్నారి మృతి

- చికిత్స పొందుతున్న ఆమె తాత

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఇంట్లోకి చొరబడ్డ పాము కాటు వేయడంతో చిన్నారి మృతిచెందగా, ఆమె తాత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషాదకర ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలంలోని జప్తి జానకంపల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారు జాము చోటుచేసుకుంది. ఎస్ఐ రాజు వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థిని జోడు వైష్ణవి (7), తన తాత శంకరయ్యతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మూడు గంటల సమయంలో ఇంట్లోకి చొరబడ్డ మొదట వైష్ణవిని కాటువేసింది.


వైష్ణవి(ఫైల్)

వివరాలు మెయిన్‌లో..

తమ సంతోషాలను సదన్ చిన్నారులతో పంచుకోండి

- దాతలకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పిలుపు
- బాలసదనం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశం


బాలసదన్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్


కలెక్టర్ పంపిన స్టేషనరీలు చిన్నారులకు అందజేత

నవతెలంగాణ-కామారెడ్డి

బాలసదనం చిన్నారులతో తమ సంతోషాలను నిర్వహించుకొని వారికి ఆనందాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ దాతలకు పిలుపునిచ్చారు. బాలసదనపు చిన్నారులతో పుట్టినరోజు, ఇతర పండగలను నిర్వహించుకునే దాతలు డిసిపిఓ నెంబర్ 9492475105 ను సంప్రదించాలని సూచించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ జిల్లా కేంద్రంలో గల బాలసదనమును ఆకస్మికంగా సందర్శించి బాలసదనంలోని అన్ని గదులను, బాలసదనం ఆవరణను పరిశీలించారు. బాలికలతో మాట్లాడి వారికి కల్పించిన వసతులు ఇస్తున్న ఆహారం, చదువుకోవడానికి కల్పించిన అవకాశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో అపరిశుభ్రత వాతావరణం తో వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున పరిసరాలను ఎప్పుడు శుభ్రం చేస్తూ బాలసదనం మొత్తం క్లీన్‌గా ఉంచాలని అన్నారు. విద్యుత్ సమస్య లేకుండా చూడాలని అన్ని ఫ్యానులు పనిచేసేలా రిపేర్ చేయాలని ఆదేశించారు. విద్యార్థుల, ఉద్యోగుల అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి చాలా రోజుల నుండి విధులకు హాజరుకాని అవుట్‌సోర్సింగ్ అటెండర్ హేమలతను విధుల నుంచి తొలగించాలని, నిరంతరం సీసీ కెమెరా పనిచేయాలని, బాలసదనం సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని, నైట్ వాచ్‌మెన్ కచ్చితంగా సాయంత్రం 4 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు బాలసదనంలోనే ఉండాలని సూచించారు. నిర్దేశించిన మెనూ ప్రకారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం ఫ్రెష్‌గా అందించాలని బాలసదనం సూపరింటెండెంట్ సంగమేశ్వరిని ఆదేశించారు. రీడింగ్ రూమ్‌ను పరిశీలించి చిన్నారులు చదువుకునేందుకు దీన్ని కచ్చితంగా ఉపయోగించాలని అన్నారు. కుట్టు శిక్షణ నేర్పేందుకు ప్రత్యేక సిబ్బంది ఉన్నందున బాలికలకు కుట్టు శిక్షణ ఇప్పించాలని, చదువుతోపాటు పిల్లలకు ఆటలు ఆడించాలని, అప్పుడప్పుడు పార్కులకు లేదా ఇతర విహారయాత్రలకు తీసుకెళ్లాలని అన్నారు. చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098కు వచ్చే అన్ని కాల్స్‌కు రెస్పాండ్ కావాలని అన్నారు. కలెక్టర్ వెంట కామారెడ్డి ఆర్డిఓ రంగనాథ చారి, జిల్లా సంక్షేమ అధికారి బావయ్య, సిడబ్ల్యుసి చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, డిసిపిఓ స్రవంతి తదితరులు ఉన్నారు.


దేశాయిపేట్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల

వివరాలు మెయిన్‌లో..

బడిలో కీచక ఉపాధ్యాయుడు

- విద్యార్థినులను లైంగికంగా వేధిస్తుండటంతో దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు
- ఫిర్యాదు ఇవ్వకుండా చక్రం తిప్పుతున్న పోలీస్ సిబ్బంది, విద్యాశాఖ అధికారి

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

పిల్లలకు విద్యాబుద్దులు నేర్పి వారిని ప్రయోజకులుగా తీర్చి దిద్దాల్సిన ఉపాధ్యాయుడు.. వారితో వికృతచేష్టలకు పాల్పడుతున్నారు. అభం శుభం తెలియని చిన్నారుల పట్ల లైంగికంగా వేధింపులతో రాక్షసానందం పొందుతున్నాడు. వేధింపులు ఎక్కువ కావడంతో విద్యార్థినులు వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వచ్చి సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ ఉన్నత పాఠశాలలో ఆలస్యంగా వెలుగుజూసింది. వివరాల్లోకి వెళ్తే.. స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న నరేందర్ ఓ వైపు విద్యార్థులకు పాఠాలు చెబుతూనే మరోవైపు విద్యార్థినిల పట్ల వెకిలిచేష్టలకు పాల్పడుతున్నాడు. టచ్ చేయకూడని చోట టచ్ చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడు. సదరు హెచ్ఎం గతంలో కూడా విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిం చాడని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. తాజాగా శనివారం ఉదయం పాఠశాలలోని ల్యాబ్ గదిలోకి కొంత మంది విద్యార్థినులను తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించి నట్టు సమాచారం. దీంతో సదరు హెచ్ఎం తీరును బాలికలు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తల్లిదండ్రులు సోమవారం స్కూల్‌కు వచ్చి హెచ్ఎం నరేందర్‌ను చితకబాదారు.

ఏకంగా ఏటీఎం మిషిన్‌కే గురి

- ఏటీఎం మిషన్‌ను ఎత్తుకెళ్లిన దుండగులు
- తెల్లవారుజామున బిచ్కుంద ఎస్‌బీఐలో ఘటన


మిషిన్‌ను ఎత్తుకెళ్తున్న దుండగులు

నవతెలంగాణ-బిచ్కుంద

ఏటీఎంలోకి చొరబడ్డ దుండగులు.. ఏకంగా ఏటీఎం మిషిన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో మంగళవారం చోటుచేసుకుంది. ఏటీఎంలో 3.95 లక్షల నగదు ఉన్నట్టు సమాచారం. ఘటనా స్థలాన్ని బాన్సువాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నరేష్ పరిశీలించారు. మూడు గంటల ప్రాంతంలో వచ్చిన దుండుగులు.. కేవలం మూడు నిమిషాల్లోనే ఏటీఎంను ఎత్తుకెళ్లినట్టు సమాచారం.

వివరాలు మెయిన్‌లో..

అంగన్‌వాడీల దీక్షకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సంఘీభావం

- జీవో 10ని రద్దు చేయాలి : సీఐటీయూ



అంగన్‌వాడీల ఆందోళనకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న రామ్మోహన్‌రావు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్‌వాడీలకు నష్టపరిచే విధంగా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 10ని రద్దు చేయాలని సమ్మె ఒప్పందాలను అమలు చేయాలని ధర్నాచౌక్‌లో చేస్తున్న దీక్షలను సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మంగళవారం ప్రారంభించారు. వీరి దీక్షలకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రావు సంఘీభావం తెలియజేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల్లో 65 సంవత్సరాల పూర్తయిన వారికి అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తూ ఇంటికి పంపుతూ ఇచ్చిన జీవో 10ని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ జిల్లా కోశాధికారి చంద్రకళ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల తో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని 2023 సెప్టెంబర్ 11 నుండి అక్టోబర్ 4 వరకు రాష్ట్రంలో 24 రోజులు నిరవధిక సమ్మె చేసినట్టు గుర్తు చేశారు. ఆ సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లకు రెండు లక్షలు హెల్పర్లకు లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్ పెంచుతామని పెన్షన్ వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. అనంతరం రాష్ట్రంలో ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఐసిడిఎస్ మంత్రి సీతక్కకు ఉన్నతాధి కారులకు పలుమార్లు దృష్టికి తీసుకురా వచ్చినట్టు తెలిపారు. గత ప్రభుత్వం జీవో 10 ఇచ్చి తక్కువ బెనిఫిట్ తో బలవంతంగా రిటైర్మెంట్ చేస్తుంటే వ్యతిరేకించడం జరిగిందని, దానిని కాంగ్రెస్ ప్రభుత్వం ఏకపక్షంగా టీచర్లు హెల్పర్ల మనోభావాలను దెబ్బతీసే విధంగా జీవో 10ని అమలు చేయాలని సర్క్యులర్ జారీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఆమె అన్నారు. ఈ జీవో అమలు చేయడం వలన రాష్ట్రవ్యాప్తంగా పదివేల మంది అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తక్కువ బెనిఫిట్ ఇచ్చి అన్యాయంగా తొలగించడానికి వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోదావరి, జగదాంబ, అరుణ, లక్ష్మి, రోజి, సునంద, గంగు, గౌరీ, లక్ష్మీబాయి, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ క్లీన్ చేస్తూ మున్సిపల్ కార్మికుడు మృతి

- పీఎఫ్, బీమా కట్టని మున్సిపల్ అధికారులు
- నష్టపరిహారం చెల్లించాలంటూ సిఐటియు డిమాండ్


ఆందోళన చేపట్టిన కార్మికులు


మృతిచెందిన కార్మికుడు..

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)

చెత్తను తొలగించేందుకు డ్రయినేజీలోకి దిగి ప్రమాదవశాత్తు మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ వెలుగులోకి వచ్చింది. టౌన్ సిఐ కృష్ణ, కుటుంబీకుల వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన తాళ్ల గంగాధర్ (35) బాన్సువాడ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలో గత 14 సంవత్సరాలుగా పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం మహేశ్వరి టాకీస్ ఎదుట ఉన్న డ్రైనేజీ గుంతలోకి క్లీనింగ్ చేసేందుకు దిగి బయటకు రాలేదు.

వివరాలు మెయిన్‌లో..

ఆన్‌లైన్ కొనుగోలులో ఆశాభంగం

- ఫోన్‌కు బదులుగా బెల్టు


బాధితుడికి వచ్చిన బెల్టు



నవతెలంగాణ-నవీపేట్

ఆన్‌లైన్ షాపింగ్ అలవాటు పట్నాల నుండి పల్లెటూర్లకు సైతం పాకింది. దీంతో ఆన్‌లైన్ షాపింగ్‌ల మోజులో పలువురు అమాయకులు నిలువునా మోసపోతున్నారు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలంలోని శివతాండకు చెందిన మెగావత్ జీవన్ నాయక్ 15 రోజుల క్రితం 'ఆశా కలెక్షన్' పేరుతో గల ఆన్‌లైన్ రూ.5000 విలువగల మొబైల్ ఫోన్ ఆర్డర్ ఇచ్చాడు. పోస్టు ద్వారా మంగళవారం ఇంటికి రాగా నగదు చెల్లించి ఆర్డర్ తీసుకొని తెరిచి చూడగా అందులో బెల్టు ఉంది. కూలినాలి చేసుకొని రూపాయి రూపాయి పోగుచేసుకొని కష్టపడి సంపాదించిన సొమ్మును ఆన్‌లైన్ వ్యాపారస్తులు దోచుకున్నారని వాపోయారు. పోలీసు యంత్రాంగం ఇటువంటి స్పందించి ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

వివరాలు మెయిన్‌లో..

ప్రజలకు సంక్షేమ ఫలాలు ఇద్దాం

- నాతో ఉన్నవారందరినీ ఒకేలా చూస్తా
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పోచారం


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసి మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

తన రాజకీయ జీవితంలో నియోజకవర్గం ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించాలనే ఆశయంతోనే పని చేస్తున్నట్టు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వర్ని, మోస్రా, రుద్రూర్ చందూర్ మండలాల లబ్దిదారులకు కళ్యాణ్‌లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆయనను పూలమాలతో సత్కరించారు. ఒక కోటి 50 లక్షల చెక్కులను అయన చేతుల మీదుగా పలు గ్రామాల నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాతో పాటు ఉన్న నాయకులు కలిసి నాతో నడువడానికి సిద్దపడటం చూస్తుంటే నియోజకవర్గం నిండు కుండల ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఆరు నెలలే అయిందని, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేందుకు కొద్దిగా సమయం పడుతుందని, అందుకు కార్యకర్తలు దిగులు పడే అవసరం లేదని అన్నారు. నియోజక వర్గంలో మిగిలిఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేయటమే తన లక్ష్యం అని తెలిపారు. తన రాజకీయ అనుభవం పార్టీ బలోపేతానికి అంకితం చేస్తానని తెలిపారు. తనతో ఉన్న వారిని ఒకేలాగా చూస్తానని ఎలాంటి లోటు, పాట్లు జరుగకుండా చూస్తాని, అందుకు అందరు సహకరించి నియోజకవర్గం అభివృద్ధి చేద్దామని కోరారు. అభివృద్ధిలో రాజీపడేది లేదని, వెనకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జడ్పీ ఫోరమ్ లీడర్ అంబర్ సింగ్, వర్ని మండల అధ్యక్షులు సురేష్ బాబా, సీనియర్ నాయకులు నెమని విరాజ్, పీసీసీ డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డి,కలల్ గిరి, వెలగపూడి గోపాల్, కర్లం సాయరెడ్డి, చందూర్ పిఏసిఎస్ చైర్మన్ అశోక్ యాదవ్, లక్ష్మపూర్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పోతారాజు శ్రీను, మోస్రా రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిట్ల శ్రీరాములు, మండల అధ్యక్షులు హన్మంత్ రెడ్డి, లక్ష్మణ్, హరి నారాయణ, ప్రశాంత్ పటేల్, శనిగరం కిషన్, శంషుద్దీన్, రాంజ్యానాయక్, మాజీ కో ఆప్షన్ నెంబర్ ఖరీమ్, విమల లింగయ్య, నామాల సాయిబాబా, మాజీ జడ్పీటీసీ నారోజీ గంగారాం ఘన్ పూర్ సలీమ్ పలు గ్రామాల కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన నేర న్యాయ చట్టాల అమలు తీరుపై అభిప్రాయ సేకరణ


అభిప్రాయాలు సేకరిస్తున్న పోలీస్ అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన నేర న్యాయ చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధీనియం అను చట్టాల అమలు తీరును పరిశీలించుట కోసం మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ అఫైర్స్ వారు (బి.పి.ఆర్.డి) బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (ఎన్.సి.ఆర్.బి) నేషనల్ క్రైమ్ రికార్డ్స్‌బ్యూరో, (సి.డి.టి.ఐ) సెంట్రల్ డిటెక్టివ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ ఐబి ఇంటిలిజెన్స్ బ్యూరోల ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసి సి డి టి ఐ హైదరాబాద్ డైరెక్టర్ రాజశేఖరన్, ఐపిఎస్., డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆధ్వర్యంలో మంగళవారం నిజామాబాద్ కమిషనరేట్‌కు విచ్చేసి వివిధ శాఖల అధికారులతో చర్చించి వారి సందేహాలను అభిప్రాయాలను సేకరించారు. ముందుగా సి డి టి ఐ డైరెక్టర్ రాజశేఖరన్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్‌తో కలిసి ఏసీపి లు, సిఐలు, ఎస్ హెచ్ ఓ లతో పాటుగా ఐటి కోర్ సిబ్బంది, పోలీసు స్టేషన్ రైటర్స్‌తో పోలీస్ కమిషనరేట్ కమాండ్ కంట్రోల్ యందు నూతన నేర న్యాయ చట్టాల అమలు తీరుపై చర్చించారు. కొత్త నేర న్యాయచట్టాల అమలులో ఎదురుకొంటున్న సమస్యలపై సిబ్బందికి గల సందేహలను నివృత్తి పరిచారు. ఈ కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ హెూమ్ అఫైర్స్ నుంచి వచ్చిన కుర్ర శ్రీనివాస్, రాజేష్ కుమార్ ఝ, సూరేపల్లి శ్రీనివాస్, వారి సిబ్బందితోపాటుగా నిజామాబాదు అదనపు డిసిపి (అడ్మిన్) కోటేశ్వర్ రావ్, నిజామాబాద్, బోధన్, అర్మూర్ ఏసీపీలు రాజా వెంకటొరెడ్డి, శ్రీనివాస్, బస్వారెడ్డి, సైబర్ క్రైమ్ ఏసిపి వెంకటేశ్వరరావు, సిసిఆర్బి ఏసిపి రవీందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి నారాయణ జిల్లాలోని వివిధ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, రైటర్లు ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్‌గంజ్‌లో నిషేధిత గుట్కా పట్టివేత

- 4 లక్షల విలువ : వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు


ఫైల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కిసాన్ గంజ్ మార్కెట్లో గల వెల్కమ్ ఏజెన్సీకి సంబంధించిన అబ్దుల్ బాసిత్ గోదామ్‌లో నిషేధిత గుట్కా ఉందని పక్కా సమాచారంతో ఏసిపి టాస్క్ ఫోర్స్ నిజామాబాద్ ఆదేశాల మేరకు పురుషోత్తం, సిబ్బంది మంగళవారం దాడి చేసినారు. వెల్కమ్ ఏజెన్సీ సంబంధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వాటి మొత్తం విలువ 4,26,873 రూపాయలు ఉంటుందని తెలిపారు. ప్యాకెట్‌లను సీజ్ చేసి పీఎస్‌కు తరలించినట్టు తెలిపారు.

సమన్విత హాస్పిటల్ సీజ్

- లింగనిర్ధారణ, శిశువు విక్రయం పట్ల వైద్యశాఖ చర్యలు


సీజ్‌చేస్తున్నట్టు నోటీసు అందజేస్తున్న వైద్యశాఖాధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డిలోని సమన్విత హాస్పిటల్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధికారులు సీజ్ చేశారు. లింగనిర్ధారణ, శిశువు విక్రయం పట్ల కలెక్టర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో చంద్రశేఖర్, డాక్టర్ శోభారాణి మంగళవారం సీజ్ చేశారు. వైద్య శాఖ పిసిపిఎన్ డి.టి.(గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షా) చట్టం ప్రోగ్రాం అధికారి డా.శోభారాణి ఆధ్వర్యంలో విచారణ చేపట్టగా.. ఆసుపత్రిలో ఎలాంటి ఎంటిపి. (మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) పర్మిషన్ లేకున్నా అక్రమంగా అబార్షన్‌లు చేస్తున్నట్టు తేలింది. హాస్పిటల్ రిజిస్ట్రేషన్, స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ లో పేర్లు ఉన్న అర్హత గల వైద్యులు ఇట్టి ఆసుపత్రిలో లేరు. ఎలాంటి వైద్య అర్హతలు లేని వి.సిద్ది రాములు స్కానింగ్ పరీక్షలు చేస్తు న్నట్లు గుర్తించారు. శిశు విక్రయం, పి.సి.పి.ఎన్. డి. టి.చట్టంలోని నిబంధనలు అతిక్రమించి నందుకు ఆసుపత్రి యాజమాన్యం పైన కేసు బుక్ చేసి ఇట్టి ఆసుపత్రిని సీజ్ చేశారు.

ఆదర్శ పాఠశాలకు వెళ్లేరోడ్డుపై గుంతలు

- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఆదర్శ పాఠశాలకు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు కురివడంతో గుంతలలో నీళ్ళు నిలిచాయి. పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.


బురద రోడ్డునుండి వెళ్తున్న విద్యార్థినులు

రోడ్లపై గుంతలు పూడ్చాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రోడ్లపై మరమ్మతుల కోసం తవ్విన తరువాత ఆ గుంతలను వెంటనే పూడ్చివేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఆర్ అండ్ బీ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షా కాలం దృష్టిలో ఉంచుకొని నిజామాబాద్ నగరంలో గుంతల మయమైన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ గజవాడ హనుమంతరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఏఈ సాయి కుమార్, ఏఈ గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విడిసి సభ్యులు


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చింతలూర్ విడిసి సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసి గ్రామ సమస్యల గురించి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛంను అందజేశారు. గ్రామంలో గుట్ట మీద గుడి నిర్మాణం, నిజామాబాద్ నుంచి భీంగల్ వరకు బస్ వేయాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేయడం జరిగిందని కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు.

ఏకరూప దుస్తులు పంపిణీ


దుస్తులు అందజేసిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రములోని మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ చేయడం జరిగిందని ప్రిన్సిపాల్ రాజేంద్రసాహు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు చేలైలా శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాధిక, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ


టై, బెల్టులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలో గల ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్టులను ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ పంపిణీ చేశారు. విద్యార్థుల కోసం సొంత డబ్బులతో టై, బెల్టు కొనుగోలు చేసి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వరలక్ష్మి ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్


వెల్‌నెస్ వైద్యాధికారితో మాట్లాడుతున్న కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

వెల్‌నెస్ సెంటర్‌కు అదనపు సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ పలుసార్లు కలెక్టర్‌ని, మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. డాక్టర్లు కూర్చోవడానికి, ఒపి సేవలందించడానికి డెంటల్, ఈసీజీ, ఫిజియోథెరపీ సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ పరిస్థితిని సరిదిద్దాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వెల్‌నెస్ సెంటర్‌ను మున్సిపల్ కమిషనర్ మకరంద్, డిప్యూటీ కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న ఎకామిడేషన్ సరిపోవటం లేదని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కే. రామ్మోహన్‌రావు, వెల్‌నెస్ సెంటర్ కో ఆర్డినేటర్ కృష్ణవేణి, కమిషనర్‌కు వివరించారు. బాత్రూంలు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అందుబాటులో ఉన్న రూమ్స్‌ను పరిశీలించారు. రెండు, మూడు రోజుల్లో అదనపు వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కమిషనర్‌తో పాటు పెన్షనర్ల సంఘ నాయకులు ప్రసాద్‌రావు, రాధా కిషన్, భోజారావు, చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.

పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పరిశీలన

నవతెలంగాణ-మాక్లూర్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న పనులను వేగవంతంగా చేపట్టి సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని ముల్లంగి (బి), బొంకన్ పల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనులను పరిశీలించారు. మాక్లూర్ మండలంలోని ముల్లంగి, బొంకన్‌పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాన్ని, పాఠశాలల్లో వంట గది, వరండా, అదనపు గదులు, వాటర్ సంప్, టాయిలెట్స్ తదితర నిర్మాణాలు, మరమ్మతు పనులను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగుతోందా.. వాటర్ సప్లై కనెక్షన్ ఉందా.. నీటి సరఫరా విషయమై సర్వే బృందాలు వచ్చి వివరాలు సేకరించాయా..? అని ఆరా తీశారు. ఇప్పటికే చాలావరకు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, ఇంకనూ పలు స్కూళ్లలో వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. వర్షాకాలం సీజన్ అయినందున పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకుని, అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. నర్సరీని సందర్శించిన సందర్భంగా, ఆయా రకాల మొక్కలు పెంచుతున్న తీరును పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా విరివిగా మొక్కలు నాటి పూర్తిస్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు సూచించారు. మండల ప్రత్యేక అధికారి ముత్తెన్న, ఎంపీడీఓ క్రాంతి, తహశీల్దార్ షబ్బీర్, పంచాతీరాజ్ ముల్లంగి గ్రామ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఉమామ తదితరులు పాల్గొన్నారు.


మాక్లూర్ : పనులను పరిశీలిస్తున్న కలెక్టర్


నందిపేట్ :మొక్కను నాటుతున్న కలెక్టర్

నందిపేట్: మండల కేంద్రంలోని రాజనగర్ స్కూల్లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పరిశీలించారు. అనంతరం వన మహోత్సవంలో పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎమ్మార్వో, స్పెషల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 60 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలి

- బిఎల్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా, వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం 19500 కనీస వేతనం ఇవ్వాలని బిఎల్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్. సిద్ధిరాములు డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ బిఎల్‌టీయూ ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న వాటర్ సప్లై, గార్డెన్స్, స్ట్రీట్ లైట్స్, ప్లంబర్, ఆఫీసులో పనిచేసే తదితర కార్మికులకు జీవో నెంబర్.60 ప్రకారం కనీస వేతనం రూ.19,500 ఇవ్వాలని డిమాండ్ చేస్తు ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మేనేజర్ జనార్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం బిఎల్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్. సిద్ధిరాములు మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం జీఓ నెంబరు 60,ప్రకారం కనీసం వేతనాలు ఇవ్వకుండా ఇష్టానుసారంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్ వారు జీవో నెంబర్.60 ప్రకారం 19500 ఇచ్చినప్పుడు ఇక్కడి నిజామాబాద్ నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ వారు అమలు చేయకపోవడం సిగ్గు చేటు అని అన్నారు. నిజామాబాద్ పాలకవర్గం వారు ప్రజలకు పన్నులను మోపడంపై ఉన్న శ్రద్ధ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. 2016లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం.. కనీస వేతనం 26వేలు ఇవ్వడం ఇవ్వాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇచ్చిన తీర్పు కూడా అమలు చేయడం లేదన్నారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులను పరిమినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

బహుజన లెఫ్ట్ మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సబ్బని లత మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికులకు తక్షణమే జీఓ నెంబరు 60 ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎలాంటి పోరాటం చేయడానికి అయిన సిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్, ఎప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేంద్రర్, ఉపాధ్యక్షులు గజ్జల యూదయ్య, కార్యదర్శి అయిటీ హరీష్, ఆర్, మురళి, కోశాధికారి సంపత్, బి.శంకర్, శ్రీశైలం, శంకర్, మహేందర్, నర్సిములు , రాజు, పుష్ప, రూప, గంగ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కరువు

- ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కరవు అయ్యాయని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. మంగళవారం అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాల సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలు ప్రారంభం అయినా విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేకపోవడం, టాయిలెట్స్ లేకపోవడం, విద్యార్థులకు మంచినీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని జిల్లా విద్య శాఖ కార్యాలయంలో కోఆర్డినేటర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు నవీన్, వంశి, సుధాకర్, పాల్గొన్నారు.

ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన రంగుల భూమేష్‌గౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. కొన్ని రోజుల క్రితం వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన కూతురు రంగుల నిషిత ఢిల్లీలోని బిట్స్ పిలానిలో బీఎస్సి కంప్యూటర్ సైన్స్‌లో సీటు సాధించిందని తెలుసుకొని ఆమె చదువుల కోసం రూ.30వేలు ఆర్థిక సహాయాన్ని అందిస్తానని తెలిపారు. విద్యార్థిని నిషితను అభినందించి బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలబడాలని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం ఉప్లూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని నిశితకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్ముల రవీందర్, బోనగిరి లక్ష్మణ్, అవారి సత్యం, బోనగిరి భాస్కర్, సుంకరి విజయ్ కుమార్, పత్రి రవి, మంతెన బాజాగౌడ్, రాజశేఖర్, రంగు రాజేశ్వర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం చిన్నారుల చిరు సహాయం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం చిరు సహాయం చేసి ఆదర్శంగా నిలిచారు. వేల్పూర్ మండలం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న ముత్తెన్నకు బిపి పెరిగి మెదడులో నరాలు చిట్లి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సర్జరీ కోసం పెద్ద మొత్తంలో డబ్బు అవసరం కాగా తమ వంతు సహాయంగా విద్యార్థులు ఎస్.మణిదీప్, శరణ్యలు రూ.1000 సహాయం అందించారు. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ సైతం రూ.2000 సహాయం అందించారు. ఉపాధ్యాయ బృందం మోహన్, విటల్, లింబాద్రి, గంగామోహన్, రేణుక, లావణ్య, రాజేశ్వర్, తదితరులు విద్యార్థులను అభినందించారు.

నేటి నుంచి మొక్కలు పంపిణీ

- మొక్కలు నాటి మంత్రి సీతక్క పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐకెపి సిబ్బంది ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు మేరకు వనమహోత్సవంలో భాగంగా బుధవారం నుండి 50 లక్షల డ్వాక్రా మహిళలకు ప్రతి ఒక్కరికి ఐదు మొక్కల చొప్పున పంపిణీ చేపట్టబోతున్నట్లు తెలంగాణ సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగాధర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి సీతక్క పుట్టిన రోజును సెర్ప్ ఉద్యోగులు వినూత్నంగా జరుపుకున్నారు. మండల సమాఖ్య కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మంత్రి సీతక్క పుట్టినరోజు వేడుకల్లో తెలంగాణ సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగాధర్ స్థానిక సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. మంత్రి సీతక్క పుట్టినరోజు సందర్భంగా మండల సెర్ప్ కార్యాలయ ఆవరణలో రావి మొక్కను నాటి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుంట గంగాధర్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి దనసరి సీతక్క ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి పేరుతో మహిళలకు బీమా సౌకర్యం, మహిళా సంఘాలకు రూ.20వేల కోట్ల వరకు రుణాల పంపిణీ, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, మహిళా సంఘాలకు మీసేవ కేంద్రాలు వంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. మంత్రి పుట్టిన రోజును పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు పెరటి మొక్కల పంపిణీ పలుచోట్ల ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవికుమార్, శ్రీనివాస్, నవీన్, అలేఖ్య, అనసూయ, సత్తెమ్మ తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న కుంటగంగాధర్, తదితరులు

నిధులు కేటాయించండి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి గ్రామ మున్నూరు కాపు కుల పెద్దలు, ఫంక్షన్ హాల్ నిర్మాణ కమిటీ సభ్యులు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి వినయ్‌రెడ్డి మంగళవారం కలిశారు. గతంలో కేటాయించిన స్థలంలో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరగా వినయ్‌రెడ్డి సానుకూలంగా స్పందించి రూ.30 లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కుల పెద్దలు వినయ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల రాము, కాంగ్రెస్ నాయకులు రవిగౌడ్, కాశీరాం అయ్యప్ప, శ్రీనివాస్, కులపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నీటిని కాచి వడపోసి తాగాలి

- ఇందల్‌వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సందీప్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజలు బోరు నీటి తాగాలని, నీటిని కాచి వడపోసి చల్లార్చి తాగాలని, ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సందీప్ అన్నారు. మంగళవారం గౌరారం ఉపకేంద్ర పరిధిలోని డోన్కల్ తండాలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి ప్రజల ఆరోగ్యసమాచారాన్ని వైద్యాధికారి డాక్టర్ సందీప్ తెలుసుకుని రోగులందరికీ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి సందిప్ మాట్లాడుతూ.. జ్వరంతో బాధపడుతున్న అందరికీ రక్త పరీక్ష నిర్వహించి దోమల వలన కలిగే మలేరియా, చిక్కునుగున్యా, డెంగ్యూ, ఫైలేరియా పై ప్రజలలో అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరిగి మలేరియా రక్త పరీక్షలు తీసుకొని తగిన మందులు అందజేశారు. తాగే నీటిని పరిశీలించారు. నీటి ట్యాంకును పరిశుభ్రం చేయాలని, బ్లీచింగ్ పౌడర్ తప్పకుండా కలపాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందజేసి ఓఆర్ ఎస్ ద్రావణం తయారు చేసుకునే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త లక్ష్మి, మహాలక్ష్మి ,ఎం ఎల్ హెచ్ పి లు కీర్తన, దీపిక, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై మోడీ స్పందించాలి

- పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్

నవతెలంగాణ-మోర్తాడ్

పరీక్ష పత్రాల లీకేజీపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని పిడిఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షలు రద్దు చేస్తూ విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ పై దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నప్పటికీ మోడీ ఎందుకు స్పందించడం లేదని, 23 లక్షల మంది విద్యార్థులు నష్టపోతున్న బిజెపి ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వాలకు యువత గుణపాఠం చెప్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏరియా నాయకులు మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు

జీవజాతికి వృక్ష సంపద గొప్ప వరం

- ఏజీఎం జితేందర్
- శ్రీ చైతన్యలో స్మార్ట్ లివింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జీవజాతికి వృక్ష సంపద గొప్ప వరమని ఏజీఎం జితేందర్ అన్నారు. నగరంలోని శ్రీ చైతన్య పాఠశాల, గూపన్‌పల్లి బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రీన్ ఇండియ మిషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజీఎం జితేందర్ విద్యార్థులకు గొప్ప సందేశం అందించారు. మొక్కలు నాటడం, చెట్లు, అడవుల పెంపకం ఆవశ్యకతను వివరించారు. భూమి మీద వృక్షాలు లేకపోతే ప్రాణులకు ఆహారం, ఆక్సిజన్, నీరు లభించవని అన్నారు. అడవులను నరకడం, చెట్లను నిర్మూలించడం వల్ల భూగోళం ఎడారిగా మారుతుందని హెచ్చరించారు. చెట్లు ప్రగతికి మెట్లు "వృక్షోరక్షతీ రక్షిత" అంటూ విద్యార్థులతో నినాదాలు పలికించారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ నరేంద్ర, ప్రిన్సిపాల్ హుస్సేన్, డీన్ ఈశ్వర్, ఇంచార్జులు శివ, రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న ఏజీఎం

గుడ్లు, నిత్యావసర సరుకులు ప్రభుత్వమే సప్లై చేయాలి

నవతెలంగాణ-మోర్తాడ్

ఐదు నెలల నుండి మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులకు బిల్లులు రాక ఇబ్బందులకు గురవుతున్నారని, నిర్వహణ ఇబ్బంది కలుగుతుందని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కింగ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపు నూరు చక్రపాణి అన్నారు. మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో ఆయన సమావేశం అయ్యారు. మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహణకు సంబంధించి ప్రభుత్వమే కోడిగుడ్లు నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని ఏజెన్సీల ద్వారా పంపిణీ చేయడం ద్వారా నిర్వాహకులకు ఇబ్బంది కలుగుతుందని అన్నారు. నిర్వాహకులు సరైన సమయంలో సామాగ్రిని పంపిణీ చేయకపోవడంతో నిత్యావసర సరుకులను ఏజెన్సీ నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి వస్తుందని, దీని ద్వారా వారు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తక్షణమే బిల్లులు మంజూరు చేయాలంటూ మండల విద్యాశాఖ సిబ్బందికి వినతి పత్రం అందించారు.

టోల్ ప్లాజా ఆధ్వర్యంలో పాఠశాలకు సహాయం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

అత్వాంగ్ డిచ్‌పల్లి టోల్ వే ప్రైవేటు లిమిటెడ్ సంస్థ, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ (సిఎస్ఆర్) నిధులతో ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం బోరు సదుపాయం, మరుగుదొడ్లు నిర్మించారు. టోల్‌ప్లాజా సిబ్బంది, టాయిలెట్ బ్లాక్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తిర్మన్‌పల్లి ఉన్నత పాఠశాలలో రెండు గదులు నిర్మాణం పూర్తి చేయడం జరిగిందని వివరించారు. రాబోవు రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని సూచించారు. కార్యక్రమంలో ఇంజనీర్ రామారావు, టోల్ మేనేజర్ చలతిరావు, రూట్ మేనేజర్ విరాజ్, సేఫ్టీ అధికారి సతీష్ పానుగంటి, మేయింటెనెన్స్ ఇంజనీర్ కృష్ణకాంత్, ఎలక్ట్రికల్ ఇంజనీర్ గణేష్, కమల్, ఉదయ్, మాజీ ఎంపిటిసి చింతల దాస్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ దర్పల్లి ప్రభాకర్, బిరిష్ శెట్టి, జర్గు రాజన్న పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
బుధవారం | జులై 10, 2024 | www.navatelangana.com

డిమాండ్స్ డే ను విజయవంతం చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్ గొండ

నవతెలంగాణ-పిట్లం/మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం, మద్నూర్, డోంగ్లి, బిచ్కుంద, జుక్కల్, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాలలో డిమాండ్స్ డేను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్ గొండ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మికుల కోరికల దినోత్సవంలో భాగంగా నియోజకవర్గంలోని మండలాల్లో సంఘటిత కార్మికులైన హమాలీ, భవన నిర్మాణ, ఆటో యూనియన్, గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశలు, విద్యుత్ కార్మికులు, హమాలీ మండల కేంద్రాలలో 11 గంటలకు డిమాండ్స్ డేలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

20వ వార్డులో డ్రై కార్యక్రమం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 20వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి డ్రై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణ ప్రజలందరూ ఎప్పటికప్పుడు ఇంటి బయట ఉండే కుండల్లోని నీళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీ వాసులకు సూచించారు. మురికి కాలువలను రోడ్లను, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్, తాయాబ సుల్తానా అంజాద్, పాత శివ కృష్ణమూర్తి, అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


కుండలోని నీరును పారపోస్తున్న చైర్‌పర్సన్

పనులు త్వరగా పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు
- పెద్దచెరువు సుందరీకరణ నిర్మాణ పనులు పరిశీలన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో గల పెద్ద చెరువు సుందరీకరణ అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టిన పార్క్, మినీ ట్యాంక్ బండ్, వాకర్స్ వే నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం ఆ పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనుల పురోగతిపై డి.ఇ వెంకటేష్ ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు సంబంధిత కాంట్రాక్టర్‌తో చరవాణిలో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం మైనార్టీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పట్టిక రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించి మంచి ఉత్తీర్ణత సాధించేటట్లు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు సాయిబాబా, సీనియర్ నాయకులు చన్న లక్ష్మణ్, శ్రీనివాస్, ఎల్లయ్య, కుడుముల సత్యనారాయణ, తిరుపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను పరామర్శించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే..

నాగిరెడ్డిపేట్ : మండలం గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి ఆంజనేయులు తల్లి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంత్రి ఆంజనేయులు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అదేవిధంగా ఎర్రకుంట తండాకు చెందిన లకావత్ సునీత రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఎర్రకుంట తండాకు చేరుకొని లకావత్ సునీత భర్త దేవి చంద్, పిల్లలను పరామర్శించారు. పిల్లల చదువు కోసం పూర్తి భరోసా కల్పిస్తానని వారికి మాటిచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి, షాహిద్ పాషా, ఠాగూర్, ఇమామ్, గులాము హుస్సేన్ దివిటి కిష్టయ్య ఉన్నారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-జుక్కల్/బోధన్

ఏబీవీపీ జుక్కల్ శాఖ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక బసవేశ్వర చౌక్‌వద్ద ఏబీవీపీ పతకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి వాసరే సతీష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు గజానంద్, వీరేశం, మనోజ్, సాయి, అంజి, సాయిరాం, మహేష్, కిరణ్, కృష్ణమోహన్, శైలేందర్, ప్రసాద్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..

బోధన్ : ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బోధన్ పట్టణంలోని మధుమలాంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం ఏబీవీపీ సీనియర్ నాయకులు సూర్యకుమార్ మాట్లాడుతూ.. ఏబీవీపీ విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి కళాశాలలో, విద్యాసంస్థల్లో ఏబీవీపీని విస్తరింపచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మణ్ చౌహాన్, ఆదు సింగ్, గంగొసింగ్, అరవింద్, సురేష్, రాజారామ్, జగదీష్, రమేష్, శివకుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్వో శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని వెంటనే రైతులకు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతులకు రెండు లక్షల వ్యవసాయ రుణాన్ని భేషరతుగా మాఫీ చేయాలన్నారు. రైతులకు రైతు భరోసా వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, రెడ్డిగారి రమేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజయ్య, బసవ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, చిన్నోల శంకర్, సాయిరెడ్డి, ఆనంద్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచస్థాయి పోటీల్లో పాల్గొని అధిక గోల్డ్ మెడల్స్ సాధించాలి

- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్

నవతెలంగాణ-పిట్లం

త్వరలో జరగనున్న ప్రపంచస్థాయి పోటీలలో పాల్గొని మరిన్ని గోల్డ్ మెడల్స్ సాధించాలని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ అన్నారు. మంగళవారం పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ హైదరాబా ద్ పట్టణంలో తన సొంత గృహంలో అంతర్జాతీయ గ్రాప్లింగ్ టోర్నమెంట్ విజేత తక్కడపల్లి ప్రతిభ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె ఇటీవల జూన్ 20, 25వ తేదీల లో భూటాన్ దేశంలోని పెన్స్ లింగ్ నందు జరిగిన అంతర్జాతీయ గ్రాప్లింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతకం సాధించిడంతో సురేష్ షెట్కార్ ఆమెను అభినందించి, మన దేశానికి మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్ కొరకు స్పాన్సర్ షిప్ అందించిన సోనీరెడ్డి పోచారంకు ప్రతిభ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఎంపీ అనుచరులు, ప్రతిభ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థినిని అభినందిస్తున్న ఎంపీ సురేష్ షట్కార్

జీపీల్లో ఆయిల్ బాల్స్ స్టాక్ ఉంచాలి

- మండల పంచాయతీ అధికారి వెంకట సత్యనారాయణ

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని గ్రామపంచాయతీలలో ఆయిల్ బాల్స్ తయారు చేసి స్టాక్ పెట్టుకోవాలని పంచాయతీ అధికారి వెంకట సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల కేంద్ర గ్రామపంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నిమిత్తం ప్రజలు విషజ్వరాలు, డెంగ్యూ, మలేరియా, వాంతులు, విరేచనాల రోగాల బారిన పడే అవకాశాలున్నందున పంచాయతీల సెక్రెటరీలు అప్రమత్తమై పంచాయతీలలోని మురికి కాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయించాలని అన్నారు. ఆయా వార్డుల్లో నీటిగుంతల, దిగువ ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఇంటింటి నల్లాల సర్వే చివరి రోజు కావడంతో పంచాయతీల వారీగా సర్వేలో తేలిన మొత్తం నల్లాల జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. పంచాయతీల వారీగా ఇంటి పన్ను, కిరాణా తదితర షాపుల బకాయిలను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు జిపిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల ఫోటోలను సంబంధిత అధికారులకు నివేదించాలని కోరారు. ఎవరైనా పంచాయతీ కార్యదర్శులు తమ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీవో

వికలాంగుల సమస్యలను పరిష్కరించాలి

- ఎన్పీఆర్డీ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలంలోని హున్స గ్రామంలో మంగళవారం ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు ఏశాల గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికి ప్రతి వికలాంగుడికి నెలకు 300 పెన్షన్ మాత్రమే ఇస్తుందని, దానిని మూడు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను రూ.6000కు పెంచాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ప్రభుత్వ ఉద్యోగాలలో ఐదుశాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వ పథకాలలో ఐదుశాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రతి వికలాంగుడికి అంత్యోదయ కార్డు ఇవ్వాలని, ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు రూ.10 లక్షలు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పిఆర్డి జిల్లా ఉపాధ్యక్షులు గైని రాములు, సాలూర మండల అధ్యక్షులు షేక్ నజీర్, సాలూర మండల కార్యదర్శి సింగాడి లక్ష్మణ్, మండల ఉపాధ్యక్షులు సిరిగిరి దేవదాస్, హున్స గ్రామ అధ్యక్షులు బాలేరావు సాయిలు, గ్రామ కార్యదర్శి కచ్చకాయల జగదీష్, గ్రామ కోశాధికారి లలిత, గంగారాం, బీరప్ప, సాయవ్వ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎన్పీఆర్డీ నాయకులు

చందూర్ వాసికి విశిష్ట ప్రతిభా పురస్కారం


విశిష్ట ప్రతిభా పురస్కారాన్ని అందుకుంటున్న బాబు

నవతెలంగాణ-వర్ని

ప్రతిష్టాత్మక శాలివాహన చారిటబుల్ ట్రస్ట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో చందూర్ మండల వాసి కుమ్మరి బాబుకు విశిష్ట ప్రతిభ పురస్కార అవార్డును శ్రీపొట్టి శ్రీరాములు ఆడిటోరియంలో ప్రముఖ కవి, శాస్త్రవేత్త తోడ్డిశెట్టి పరమేష్ సోమవారం అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాలలోని శాలివాహనులకు అందించే సేవలను గుర్తించి పలు జిల్లాల శాలివాహన ఉద్యోగులకు, కవులకు, రచయితలకు అవార్డులను అందజేసినట్లు అందులో నిజామాబాద్ జిల్లా చందూర్ మండలం నుంచి తాను పురస్కార అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.

కోటగిరిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కాసుల బాలరాజుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్‌గా నియమించడంతో జిల్లా నాయకులు కొట్టం మనోహర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. కాసుల బాలరాజు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేశారని, ఆపద సమయంలో పార్టీని బలోపేతం చేసి, కాంగ్రెస్ పార్టీని నిలబెట్టారని దానిని గుర్తించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నామినేటెడ్ పదవి ఇవ్వడం పట్ల కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. నిజమైన కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తిస్తుందని వివరించారు. ఎటువంటి వర్గాలు లేకుండా కాంగ్రెస్ పార్టీని బాన్సువాడ నియోజకవర్గంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షుడు ఆనంద్, కొల్లూరు కిషోర్ బాబు, బర్ల మధు, నాయుడు వేణు, కూచి శ్రీనివాస్, బర్ల రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మొక్కలను దత్తత తీసుకోవాలి

- ప్రత్యేక అధికారి విజయ్ భాస్కర్

నవతెలంగాణ-నిజాంసాగర్

పాఠశాలలో నాటిన మొక్కలను విద్యార్థులు దత్తత తీసుకోవాలని నిజాంసాగర్ ప్రత్యేక అధికారి విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మొక్కలు నాటడం వలన సకాలంలో వర్షాలు కురుస్తాయని ఆయన విద్యార్థులకు తెలిపారు. ప్రతి ఒక్క మొక్కను ఒక్కొక్క విద్యార్థి దత్తతగా తీసుకొని వాటికి రోజు నీటిని పోసి సంరక్షించాలని ఆయన సూచించారు. మొక్కలు ఉండడం వలన వాతావరణం కాలుష్యం కాకుండా, వాతావరణంలో ఉన్నటువంటి హానికరమైన విష వాయువులను మొక్కలు పీల్చుకుని మనకు ఆక్సిజన్ అందిస్తాయని ఆయన అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను పర్యవేక్షించి, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వన మహోత్సవ గురించి సమీక్ష నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్, మండల పంచాయతీ అధికారి యాదగిరి ఏపీవో శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


చెట్టుకు నీరు పోస్తున్న ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్

ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలి


మొక్కను నాటిన ప్రత్యేకాధికారి రజిత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు ఇంటి పరిసరాలలో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని మండల ప్రత్యేక అధికారి రజిత తెలిపారు. మంగళవారం మండలంలోని లక్ష్మీదేవునిపల్లి, అంతంపల్లి, పెద్ద మల్లారెడ్డి, భిక్కనూర్, గ్రామాలలో మొక్కలను నాటి పంపిణీ చేశారు. అలాగే గ్రామాలలోని అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించారు. రెండో విడత విద్యార్థిని విద్యార్థులకు దుస్తులు కుట్టు కేంద్రాలను పర్యవేక్షించి విద్యార్థులకు దుస్తులు త్వరగా అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏపీవో రాధిక, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రంగులు వేశారు.. పేరు రాయడం మరిచారు..


పాఠశాలకు భవనానికి లేని పేరు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలకు అధికారులు రంగులు వేయించారు. కానీ పాఠశాల పేరు రాయడం మరిచిపోయారు. రంగులు వేసి నెలలు గడిచినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 44వ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పాఠశాలలు ఇలా ఉంటే మారుమూల పాఠశాలల పరిస్థితి ఎలా అని పలువురు చర్చించుకుంటున్నారు. ఈ పాఠశాలకు పలు గ్రామాల విద్యార్థులు విద్యనభ్యసిస్తుంటారు. పాఠశాల భవనానికి పేరు లేకుంటే పాఠశాలను గుర్తుపట్టేది ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే

నవతెలంగాణ-కోటగిరి

డయేరియా వ్యాప్తి నివారణ కోసం మండల కేంద్రంలోని వినాయకనగర్ ఏరియాలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ఈ పరిశీలన కార్యక్రం 01.07.2024 నుంచి 31.08.2024 వరకు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది గ్రామాలలో ఉన్న ప్రతి 0-5 సంవత్సరం ఉన్న పిల్లలు గల ప్రతి ఇంటిని సందర్శించి పిల్లల యోగక్షేమాలు తెలుసుకుని నీళ్ల వీరేచనాలపైన తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సర్వే ద్వారా చిన్న పిల్లలు మరణాలు తగ్గించే విధంగా ఉపయోగపడునని తెలియజేశారు. పిల్లలకు నీళ్ల వీరేచనాలు అయినప్పుడు తప్పకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య కార్యకర్త శ్రీదేవి, ఆశ గంగామణి పాల్గొన్నారు.


సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని లచ్చన్ గ్రామంలో మంగళవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించారు. ప్రతి సంవత్సరం ఆషాడ మాసంలో జరుపుకునే గ్రామదేవతల పండుగలను గ్రామ ప్రజలంతా భాజాభజంత్రీలతో నైవేద్యాలు సమర్పించి ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2024 విద్యా సంవత్సరానికి స్ప్రింగ్ సీజన్‌కు గాను తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించే మైనారిటీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైనులు, బుద్ధిస్టులు, పార్శీలు) ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం (సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం) కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో 60శాతం మార్కులు ఉండి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయుటకు, పీజీలో 60శాతం మార్కులు వచ్చి పిహెచ్‌డి చేయాలనుకునే వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందు విద్యార్థులు స్ప్రింగ్ సీజన్ (జనవరి 2024 నుండి జూలై 2024) వరకు ఎంపిక చేయబడిన విదేశీ యూనివర్సిటీలలో అడ్మిషన్ పొంది ఉండాలని తెలిపారు. అర్హులు ధృవపత్రాలతో ఆన్ లైన్‌లో 08.07.2024 నుండి 07.08.2024 లోపు దరఖాస్తు చేసుకుని 27.08.2024 లోపు దరఖాస్తులను అందజేయాలని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం, నిజామాబాద్ దరఖాస్తులు ఆన్ లైన్ చేయుటకు వెబ్ సైట్ www.telanganaepass.cgg.gov.in సంప్రదించాలని తెలిపారు.

మాజీ ప్రజాప్రతినిధులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్


మాజీ ప్రజాప్రతినిధిని సన్మానించిన అధికారులు, సిబ్బంది

ఆలూరు మండలంలోని మచ్చర్ల గ్రామ పంచాయతీ అధికారులు మాజీ ప్రజాప్రతినిధులను మంగళవారం సన్మానించారు. మాజీ ఎంపీపీ పస్కా నరసయ్యతో పాటు స్పెషల్ ఆఫీసర్, గ్రామ కార్యదర్శి, మాజీ సర్పంచ్ గంజి నర్సయ్య, వార్డుమెంబెర్స్, చైర్మన్‌ను సన్మానించారు. ఐకెపి, ఆశవర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్, పారిశుధ్య కార్మికులు సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారి అభిమానానికి ధన్యవాదాలు తెలిపారు.

సీటు కన్ఫామ్ చేసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం బీ ఏ, బికాం, బీఎస్సి, బీసిఏ, బీబీఏ, బీఎస్సీ హనర్, కోర్సుల్లో దోస్త్ ఆన్లైన్‌తో సీటును పొందిన విద్యార్థులు ఈనెల 12 లోపు సంబంధిత సర్టిఫికెట్లతో గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు వచ్చి తమ సీట్లను కన్ఫామ్ చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. రామ్ మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. నిర్ణీత తేదీ లోపల సీటును కాన్ఫమ్ చేసుకోని యెడల విద్యార్థులు కళాశాలలో వారికి కేటాయించిన సీటును కోల్పోతారని తెలిపారు.

దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

మండల విద్యాధికారి స్వామి


మాట్లాడుతున్న ఎంఈవో స్వామి

నవతెలంగాణ-భీంగల్

దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని మండల విద్యాధికారి స్వామి తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని బోయ గల్లిలో గల బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమల వల్ల వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఇంటి పరిసరాలలో, టైర్లు, నిలువ ఉన్న మురికి నీటిపై దోమలు నిలువ ఉంటాయని, వీటితో డెంగ్యూ, చికెన్ గున్యా మలేరియా లాంటి వ్యాధులు వస్తాయని తెలిపారు. కనుక పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రతి వ్యక్తి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు లింబాద్రి ఉపాధ్యాయులు వాసుదేవ్, రఘు వాస్, మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

ఎండు గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు


గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని, గంజాయిని పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మిస్టర్ 360 రెస్టారెంట్ దగ్గర అక్రమంగా ఎండు గంజాయి అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో దాడులు నిర్వహించి ఒకరిని అదుపులోకి తీసుకున్నట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్ మంగళవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కు చెందిన మహమ్మద్ వహీద్ అలీ అనే వ్యక్తిని పట్టుకొని ఆయన వద్ద గల 800 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితున్ని విచారించారు. నాందేడ్ పట్టణం నుండి ఒక కిలో ఎండు గంజాయి తీసుకొచ్చి 200 గ్రాముల చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయించినట్టు తెలిపారు. ఎండు గంజాయిని విక్రయించగా మిగిలిన 800 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు తెలిపారు. కాగా ఈ రెస్టారెంట్ పరిసర ప్రాంతాల్లో గంజాయిని సేవిస్తున్న నలుగురు వ్యక్తులను గుర్తించి తహసిల్దార్ గజానను ముందు బైండోవర్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు ధర్మేందర్, సందీప్, వికాస్ గౌడ్, నరేష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 8 మంది విద్యార్థుల ఎంపిక


జాబ్‌మేళాకు ఎంపికైన విద్యార్థులు, కంపెనీప్రతినిధులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు తెలంగాణ యూనివర్సిటీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థలు సంయుక్తంగా డిఎస్ టెక్నాలజీస్ కంపెనీలో గల టెక్నికల్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూట్, డిజిటల్ మార్కెటింగ్ ఖాళీల భర్తీకి డిఎస్ టెక్నాలజీస్ వారిచే క్యాంపస్ ప్లేస్ మెంట్ డ్రైవ్ మంగళవారం నిర్వహించారు. 58 మంది రిజిస్టర్ చేసుకోగా వ్యక్తిగత పరిచయ రౌండ్, గ్రూప్ డిస్కషన్, ముఖాముఖి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 8 మంది విద్యార్థులు వివిధ పోస్ట్ లకు ఎంపికయ్యారని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కంపెనీలు యూనివర్సిటీ కి రానున్నాయని విద్యార్థులు సిద్ధం కావాలని ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ రాజేష్, అసిస్టెంట్ మేనేజర్ యు. సత్యనారాయణ, మిస్ వర్షిని హెచ్ ఆర్, గఫార్, టీం లీడ్ ప్రొఫెసర్ రాంబాబు గోపిశెట్టి, డాక్టర్ జి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎంపికైనా విద్యార్థులకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యం. యాదగిరి, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆరతి, ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పాత నాగరాజు అభినందనలు తెలిపారు.

వనమహోత్సవానికి ప్రాధాన్యతనివ్వాలి

- మహిళా శక్తి కార్యక్రమ లక్ష్యం కోసం కృషిచేయాలి
- నెలరోజుల్లో రెండోజత యూనిఫాంలు కుట్టించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి



వీసీలో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి


పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పర్యావరణాన్ని పరిరక్షిస్తూ, పచ్చదనం పెంపొందించేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమానికి ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి సూచించారు. వనమహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతో పాటు, ధరణి దరఖాస్తులు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉద్యోగుల సాధారణ బదిలీలు తదితర అంశాలపై మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. వర్షాలు ఒకింత ఆలస్యమైనప్పటికీ ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్నందున పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ఇది ఎంతో అనుకూలమైన సమయమని సీఎస్ అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అనువైన స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకు పైగా మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని అన్నారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయించాలని, ఆగస్టు నెలాఖరు నాటికి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా నూటికి నూరు శాతం మొక్కలు నాటేలా పకడ్బందీ కార్యాచరణ అమలు చేయాలన్నారు. ముఖ్యంగా అటవీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలు వనమహోత్సవం విజయవంతంలో క్రియాశీలకపాత్ర పోషించాలన్నారు. గ్రామాలను దత్తత తీసుకుని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా వివిధ వర్గాల వారిలో స్ఫూర్తిని పెంపొందించాలని కలెక్టర్లకు సూచించారు. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్, సంపద వనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎక్కడైనా లోపాలు ఉంటే సరిదిద్దాలని అన్నారు. నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను అవసరమైన ప్రదేశాలకు చేరవేస్తూ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

కాగా, మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమాన్ని అన్ని జిల్లాలలో విజయవంతంగా అమలు చేస్తూ, ప్రభుత్వ లక్ష్యం సిద్ధించేలా అంకితభావంతో కృషి చేయాలని సీఎస్ సూచించారు. ఇప్పటికే మహిళలను భాగస్వాములు చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల నేతృత్వంలో మౌలిక సదుపాయాల మెరుగుదల పనులు చేపట్టడంతో పాటు, విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతలను కూడా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందించారనితెలిపారు. నెల రోజుల్లోపు రెండవ జత స్కూల్ యూనిఫామ్ లను కూడా కుట్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళలు డెయిరీ, పౌల్ట్రీఫామ్, క్యాంటీన్ వంటి యూనిట్లు స్థాపించేందుకు, చిన్న తరహా పరిశ్రమలు, స్థానిక పరిస్థితులకు అనువుగా ఉండే వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వపరంగా తోడ్పాటును అందించాలన్నారు. జిల్లా, మండల సమాఖ్య, డీపీఎంలు, ఏపీఎంలు అందరితో తక్షణమే సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, మహిళా సంఘాల సభ్యులకు మహిళా శక్తి కార్యక్రమం గురించి విస్తృత అవగాహన కలిగేలా చూడాలని సూచించారు. అన్ని శాఖలు భాగస్వాములవుతూ, పరస్పరం సమన్వయంతో పని చేయాలన్నారు. మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకునేలా, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని వారికి అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీ రుణ సదుపాయం కల్పించడం, ఉత్పత్తి చేసిన సరుకులు మార్కెటింగ్‌కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని అన్నారు. 16 రకాల యూనిట్లు ఇందులో భాగమని తెలుపుతూ, ఈ పథకాన్ని జిల్లాలలో దిగ్విజయంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని సీ.ఎస్ సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని, సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, వంటగది, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, వర్షపు నీరు, మురుగు జలాలు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డెంగీ, మలేరియా, అతిసారా, విషజ్వరాలు వంటి వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశాలు, ఎఎన్ఎంలు, ఇతర సిబ్బంది క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా పని చేయాలని, ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ రంగం సంబంధించి ఎరువులకు ఎలాంటి కృత్రిమ కొరత లేకుండా చూడాలని, రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు నేస్తం ప్రోగ్రాంల ద్వారా రైతులకు కావలసిన సలహాలు, నూతన సాగు విధానాలపై ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులలో పూర్తి కాని పనులను వెంటనే చేయాలని తెలిపారు. టీచర్ల బదిలీలు విజయవంతంగా జరిపిన విధంగానే, ఉద్యోగుల సాధారణ బదిలీలను కూడా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నిబంధనలను పాటిస్తూ ఈ నెల 20 వ తేదీ లోగా పూర్తి చేయాలని సీ.ఎస్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, జెడ్పి సీ.ఈ.ఓ ఉష, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ చక్రవర్తి తరుణ్ కుమార్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, సీపీఓ మల్లికార్జున్, మెప్మా పీడీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జిఎస్‌లో విద్యార్థుల పార్లమెంటరీ ఎన్నికలు


ఓటు వేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలోని దాస్ నగర్‌లో గల నవ్య భారతి గ్లోబల్ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల పార్లమెంటరీ స్థాయి ఎన్నికలను నిర్వహించారు. పాఠశాల హెడ్ బైగా హెడ్గేల్‌గా 2024- 25 గాను విద్యార్థులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సంతోష్ కుమార్, శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి, ఓటు విలువను ప్రతి విద్యార్థికి తెలియజేయడానికి పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహించామని వారన్నారు. ఉద్యోగాల రిత్యా తమ తల్లిదండ్రులు ఓటు హక్కును వినియోగించు కోలేకపోతున్నారని, ఓటు హక్కు విలువను తల్లిదండ్రులకు ఇరుగుపొరుగు వారికి తెలియజేయాలని విద్యార్థులకు తెలియజేశారు. తమ పాఠశాల నుండి 10 మంది విద్యార్థులు ఎన్నికల్లో పాల్గొన్నారని, ఒకటవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారని వారు తెలిపారు. వీరిలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ , స్పోర్ట్స్ కెప్టెన్ కల్చరల్ కెప్టెన్‌లను విద్యార్థులు ఎన్నుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆంటోనీ హెచ్‌ఆర్ లత వైస్ ప్రిన్సిపల్ సరిత అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 21న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నిజామాబాదు - 2 డిపో నుండి అరుణాచలంకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని రీజినల్ మేనేజర్ కె. జానీ రెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 19 రాత్రి 08 గంటలకు నిజామాబాద్ నుండి బయలుదేరి 20 రోజున ఉదయం 10 గంటలకు కాణిపాకం చేరుకొని విఘ్నేశ్వరుని దర్శనానంతరం సాయంత్రం 05 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్ చేరుకుంటుందని పేర్కొన్నారు. దర్శనానంతరం రాత్రికి అరుణాచలం చేరుకొని, గిరి ప్రదక్షిణ పూర్తి అయినా తర్వాత ఈనెల 21 సాయంత్రం 05 గంటలకు అరుణాచలం నుండి బయలుదేరి 22న ఉదయం. 04 గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకొని, అక్కడ దర్శనం అనంతరం ఉదయం 09 గంటలకు జోగులాంబ ఆలయం నుండి బయలుదేరి సాయంత్రం 06 గంటలకు నిజామాబాదు చేరుకుంటుందని ఆయన అన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.4200, పిల్లలకు రూ.3400 ఉంటుందని నిజామాబాద్, కామారెడ్డి జిల్లా ప్రయాణికులు, అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులు సదువినియోగించుకోవాలని తెలిపారు. అలాగే సంస్థ వెబ్ సైట్ www.tsrtconline.in లో సమీప బస్సు రిజర్వేషన్ కౌంటర్ నందు టిక్కెట్ బుక్ చేసుకునే సౌకర్యం కలదని పేర్కొన్నారు.

సెమిస్టర్‌ను వాయిదా వేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 15 న ప్రారంభిస్తున్నారని, ఇదే నెలలో 18 నుంచి ఆగస్టు 5వ వరకు డీఎస్‌సీ పరీక్షలు ఉన్నాయని, వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని పరీక్షలను వాయిదా వేయాలని తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌యుఐ, గిరిజన శక్తి ఆధ్వర్యంలో మంగళవారం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో చాలామంది నిరుద్యోగ విద్యార్థులు డీఎస్సీ పరీక్షల కోసం సిద్ధం అవుతున్నారని అన్నారు. యూనివర్సిటీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని వారు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తిసుకోవలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ యూనివర్సిటీ అధ్యక్షులు శ్రీ శైలం, గిరిజన శక్తి శ్రీను రాథోడ్, యూనివర్సిటీ విద్యార్థులు మహేష్, హరిత, సౌందర్య, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార అభివృద్ధి మెళకువలు తెలుసుకోవాలి



మాట్లాడుతున్న డీపీఎం సాయిలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వ్యాపార అభివృద్ధి కోసం మెళకువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఐకెపి డిపిఎం సాయిలు అన్నారు. మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ అధ్వర్యంలో ఉడిపి ఇంట్రిప్రెరేన్ షిప్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా డిపిఎం సాయిలు మాట్లాడుతూ ఈ శిక్షణా వ్యాపారంలో మహిళలు అభివృద్ధి చెందడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఇంట్లో ఉంటునే వ్యాపారం చేసుకొని అభివృద్ధి చెందాలని తమ కాళ్ళమీద నిలబడి ఎదగడానికి చాలా చక్కని అవకాశం అని తెలిపారు. ఆర్ఎస్ఈటిఐలో శిక్షణ చాలా బాగా నాణ్యతతో నేర్పిస్తున్నారని వివరించారు. ఈ సంస్థలో నేర్చుకున్న ఎంతో మంది మహిళలు జీవితంలో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుతం స్కూలు డ్రెస్ లు కుట్టడం అనేది చాలా మంచి అవకాశమని, మహిళలకు పని దొరుకుతుందని ఈ శిక్షణలో స్కూలు డ్రెస్ లు కటింగ్, కుట్టడం నేర్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సుంకం శ్రీనివాస్, సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, నవీన్, రంజిత్, తోపాటు పాల్గొన్నారు

టీజీఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు ఘన సన్మానం

- ఈరవత్రి అనిల్‌ను సన్మానించిన సునీల్ కుమార్
- అనిల్‌కు మండల నాయకుల శుభాకాంక్షలు


బాల్కొండ : అనిల్‌ను సన్మానిస్తున్న నాయకులు


కమ్మర్‌పల్లి :అన్వేష్‌రెడ్డికి బొకే అందిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/బాల్కొండ

మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఈరవత్రి అనిల్ ను కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

తెలంగాణా రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన ఈరవత్రి అనిల్ కు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బాల్కొండ నియోజకవర్గానికి చెందిన నాయకులకు కార్పొరేషన్ పదవులు వరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈరవత్రి అనిల్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉప్లూర్ మాజీ సర్పంచ్ బద్దం రమేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు అబ్దుల్ రఫీ, తదితరులు ఉన్నారు.

బాల్కొండ :తెలంగాణ రాష్ట్ర ఖనిజా అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఈరవత్రి అనిల్‌ను మంగళవారం టీజీఎండిసి ప్రధాన కార్యాలయంలో కిసాన్ నగర్ గ్రామ పద్మశాలి సంఘు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షుడు చిలువేరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు తమ్మె కపిల్ కుమార్, సలహాదారుడు పుట్టపర్తి పురుషోత్తం, మాజీ అధ్యక్షుడు మేక నరేందర్, ఆరుట్ల రమేష్ ,ఆరుట్ల నాగరాజు పాల్గొన్నారు.

అన్వేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

కమ్మర్‌పల్లి :తెలంగాణా రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సుంకెట అన్వేష్ రెడ్డిని మంగళవారం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకెట రవి అన్వేష్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు అబ్దుల్ రఫీ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి గ్రామం ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు విద్యబోధించిన ఉపాధ్యాయుడు సురేష్, దూపల్లి ప్రైమరీ పాఠశాలకు బదిలీపై వెళ్లడంతో గ్రామ పెద్దలు ఆయనను శాలువా పూలమాలతో మంగళవారం ఘనంగా సన్మానించారు. గత 12 సంవత్సరాలుగా తమ గ్రామంలో చిన్నారులకు విద్యను బోధించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దారని, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరేందర్ శేఖర్, తాజా మాజీ సర్పంచ్ పాముల సాయిలు, మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ సుదర్శన్, ఆలయ కమిటీ అధ్యక్షులు సాయగౌడ్, కార్యదర్శి చింతల గోపాల్, ఆటో సాయిలు, సుభాష్‌గౌడ్, విట్టల్, అంగన్వాడీ టీచర్ సరోజ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

- డాక్టర్ శివకుమార్


మొక్కలు నాటుతున్న సిబ్బంది

నవతెలంగాణ-పిట్లం

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వాసుపత్రి డాక్టర్ శివకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో 30 మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు అర్జున్, సమద్, హెచ్ఈవో భూమయ్య, వైద్యసిబ్బంది, పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- సమస్య పరిష్కరించేవరకూ సమ్మె
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్
- ఎడపల్లి ధర్నాచౌక్‌లో జీపీ పారిశుధ్య కార్మికుల సమ్మె ప్రారంభం


సమ్మెలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులకు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలను విడుదల చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంగాధర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మండల కేంద్రంలోని ధర్నా చౌక్‌లో జీపి పారిశుధ్య కార్మికులతో కలిసి సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత నెల 26న జిల్లా కలెక్టర్‌కు, జిల్లా పంచాయతీ అధికారికి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికుల బకాయి వేతనాలు మంజూరు చేయాలని వేరువేరుగా వినతిపత్రాలు ఇచ్చిమని తెలిపారు. అధికారులు స్పందించకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులతో పాటు సిబ్బందికి బకాయి వేతనాలను ప్రభుత్వం ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలకు సుమారు రూ.29వేల కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, ఎలాంటి నిధులు మంజూరు చేయలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బకాయి వేతనాలు విడుదల చేసేంతవరకూ సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. పారిశుధ్య కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎడపల్లి మాజీ సర్పంచ్ శంకర్‌నాయుడు మద్దతు తెలిపారు. సమ్మెలో కూర్చున్న వారిలో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ యూనియన్, రాష్ట్ర నాయకురాలు జోగ్గరి పద్మ, తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, మండల బిల్ కలెక్టర్, అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అదనపు న్యాయవాదిగా మహమ్మద్ గౌసుద్దీన్



నవతెలంగాణ-బోధన్

బోధన్‌లోని ఐదవ జిల్లా అదనపు న్యాయస్థానంలో ప్రభుత్వ అదనపు న్యాయవాదిగా బోధన్ పట్టణానికి చెందిన న్యాయవాది మహమ్మద్ గౌసుద్దీన్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ సిఫార్సు మేరకు గౌసుద్దిన్‌ను నియమించారు. సీనియర్ న్యాయవాదిగా ఉన్న గౌసుద్దిన్ గతంలో బోధన్ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

సున్నపు రాళ్ల తండాలో శీతల పండుగ


శీతల పండుగలో పాల్గొన్న గిరిజనులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొడుగుమర్రి తాండ గ్రామపంచాయతీ పరిధిలో సున్నపు రాళ్ల తండాలో గిరిజనుల ఆరాధ్య దైవం శీతల భవానికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని గిరిజన సాంప్రదాయాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో తాండ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక వరి వంగడాలపై అవగాహన

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని రైతు వేదికలో స్వల్ప కాలిక వరి వంగడాలపై వ్యవసాయ శాఖ అధికారులు, విస్తీర్ణ అధికారులకు సిబ్బందికి రాష్ట్రస్థాయి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఎడపల్లి, రెంజల్, బోధన్, నవీపేట్, మండలాలకు చెందిన వ్యవసాయ శాఖ అధికారులు, విస్తీర్ణ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. రైతులు పండించే ప్రతి పంటను క్షుణంగా వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి సలహాలు, సూచనలను అందజేయాలన్నారు. వరి వంగడాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు సలహాలను ఎప్పటికప్పుడు చెప్పాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మండలాల వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధి రామేశ్వరావు, విస్తీర్ణ అధికారులు జ్యోతి, సప్తగిరి తదితరులు పాల్గొన్నారు.

4వ వార్డును పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

పట్టణంలోని 4వ వార్డును మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పరిశీలించి డ్రై కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణ ప్రజలందరూ ఎప్పటికప్పుడు ఇంటి బయట ఉండే నీటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురికి కాలువలను, రోడ్లను, పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వార్డ్ కౌన్సిలర్, పిడుగు మమత సాయిబాబా, పాత శివ కృష్ణమూర్తి, ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కొడాలి కిషోర్‌కు ఘన సన్మానం

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో జీమార్ట్ స్పెషల్ డీజిల్ ప్రారంభించి 4 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఇందూరు విద్యాసంస్థల అధినేత కోడలి కిషోర్ కుమార్‌ను రిలయన్స్ పెట్రోల్ బంక్ మేనేజర్ ఖటకం రమేష్ శాలువా, పూలమాలలతో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రిలయన్స్ పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

లచ్చన్ గ్రామంలో కుళాయిలు బిగింపు

- నవతెలంగాణ కథనానికి స్పందన



నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని లచ్చన్ గ్రామంలో అధికారులు కుళాయిలు బిగించారు. 'కుళాయిల పరిస్థితి అధ్వాన్నం' అనే శీర్షికన నవతెలంగాణలో మంగళవారం కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామపంచాయతీ అధికారులు కుళాయిలను బిగించి నీటి వ్యవస్థను శుభ్రపరిచారు.

విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు

- నాణ్యమైన భోజనం అందించాలి
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు
- మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ
- రికార్డులు తనిఖీ చేసిన ఎమ్మెల్యే


విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాజరు పట్టికలను ఆయన పరిశీలించారు. సోమవారం వివిధ పత్రికలలో కేజీబీవీ పాఠశాల విద్యార్థులు భోజనం కోసం తల్లడిల్లుతున్నట్టు వచ్చిన కథనాలు చూసి పాఠశాలలను తనిఖీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ వీణ ఆడిట్‌పై వెళ్లడంతో ఇంచార్జ్ ఉపాధ్యాయురాలు అనురాధను పాఠశాల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట మనుషులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. మొదటి తప్పుగా వార్నింగ్‌తో సరిపెడుతున్నానని, రెండవసారి విద్యార్థులకు భోజనం విషయంలో, చదువు విషయంలో ఇబ్బందులున్నట్టు తమ దృష్టికి వస్తే వెంటనే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కేజీబీవీ పాఠశాలకు సరుకులు అందిస్తున్న ఏజెన్సీ నిర్వాహకుడు దీపక్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. నాణ్యమైన సరుకులను పంపిణీ చేయాలని లేదంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరిగి రెండు మూడు రోజుల్లో పాఠశాలను సందర్శించడానికి మళ్లీ వస్తానని అప్పుడు సమస్యలు రిపీట్ అయితే తక్షణ చర్యలుంటాయని ఆయన అన్నారు. ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా పెట్టాలని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని లేకుంటే ఏజెన్సీని తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల భోజనం పట్ల చదువు పట్ల ఎవరని క్షమించబోనని నాణ్యమైన విద్య నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు.

భోజనం సరిగా పెట్టడం లేదు : ఎమ్మెల్యేతో విద్యార్థులు..

ఎలాంటి సమస్యలున్నాయని ఎమ్మెల్యే విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యార్థులు 'తమకు ప్రతిరోజు భోజనం సరిగా పెట్టడం లేదు. సమయానికి భోజనం అందించడం లేదు. టిఫిన్ కూడా టైమ్‌కు పెట్టడం లేదు. నీళ్ల పప్పుచారు వండుతున్నారు.' అంటూ విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఇవన్నీ పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు ఠాగూర్, జనరల్ సెక్రెటరీ దివిటి కిష్టయ్య, కోఆప్షన్ సభ్యుడు షాయద్ పాషా, మైనారిటీ అధ్యక్షుడు ఇమామ్, యూత్ అధ్యక్షుడు శ్రీరామ్‌గౌడ్, నాయకులు సురేందర్ గౌడ్, బాల్‌డ్డి, కుమార్, అహ్మద్, కలీం, గులాం హుస్సేన్, పర్వతరావు, ఫరూక్ సాబ్, సాయ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.

డిగ్రీ కళాశాల, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల, క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన యువకులు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావును మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యువకులు తూర్పు సజన్ రాజ్, సింధూర్ తదితరులు పాల్గొన్నారు.

సహ చట్టం అమలు చేయాలి

- రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ.సలీం

నవతెలంగాణ-కామారెడ్డి

సమాచార హక్కు చట్టం 2005ను ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఏ.సలీం అన్నారు. మంగళవారం ఆర్‌డిఓ కార్యాలయంలోని ఏఈ నర్సింలుకు వినతి పత్రాన్ని సహ చట్ట పరిరక్షణ కమిటీ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర డైరెక్టర్ మాట్లాడారు. 12 అక్టోబర్ 2005లో వచ్చిన ఈ చట్టాన్ని చాలావరకు ప్రభుత్వ కార్యాలయంలో బోర్డులు లేవని తెలియజేశారు. కార్యక్రమంలో సహ చట్ట పరిరక్షణ కమిటీ జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అలీముద్దీన్, మొహమ్మద్ సాధకలి, ప్రతినిధులు షేక్ మదర్ భాష, నరసింహచారి, జిల్లా జాయింట్ సెక్రెటరీ సంకి రతన్, సంతోష్ పాల్గొన్నారు.

నీటి నమూనాల సేకరణ

నవతెలంగాణ-రెంజల్

మండలంలో జలజీవన్ మిషన్ కేంద్ర బృంద మిషన్ భగీరథ నీటి నమూనాలను మంగళవారం సేకరించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున నీటి నమూనాలను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జల జీవన్ మిషన్ కేంద్ర బృందం అధికారులు సునీల్ గౌడ్, ఎంపీడీవో హెచ్. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ముని నాయక్, ఏఈ గబ్బర్‌సింగ్, ఏఈ చంద్రకాంత్, జల జీవన్ మిషన్ ఇంఛార్జ్, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనారాయణ, అంగన్వాడీ టీచర్ రజిత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దండిగుట్ట ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తీర్ణం అధికారి చింతల శ్రవణ్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చిన్నారులు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలని ఆయన అన్నారు. వర్షాకాలంలో దోమలతో మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగ్యూ, పచ్చకామెర్లు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త విజయ, అంగన్వాడీ కార్యకర్త కవిత, ప్రధానోపాధ్యాయులు మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటిన బిజెపి నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

త్యాగశీలి డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి పక్షోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి నాయకులు, జిల్లా, మండల, పోలింగ్ బూత్ నాయకులు అందరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని బీజేపీ పార్టీ, కార్యక్రమ ఇంచార్జి యెండల లక్ష్మీనారాయణ పిలుపు మేరకు కోటగిరి బిజెపి పార్టీ మండలాధ్యక్షుడు ఏముల నవీన్ తన తల్లితో కలిసి మంగళవారం ఒక మొక్కను నాటారు.

హిందీ జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో మద్నూర్ వాసికి నాలుగో ర్యాంకు



నవతెలంగాణ-మద్నూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్సీ హిందీ జూనియర్ లెక్చరర్ పోస్టుల భర్తీకిగానూ నిర్వహించిన పరీక్షల్లో మద్నూర్ మండల కేంద్రానికి చెందిన విశ్వజిత్ కాంబ్లే అనే యువకుడు రాష్ట్రంలోనే నాలుగో ర్యాంకు సాధించారు. హిందీ జూనియర్ లెక్చరర్ పోస్టుకు 450 మార్కులకు గాను ఈ యువకుడు 340.859 మార్కులు సాధించారు. మద్నూర్ మండల కేంద్రానికి చెందిన యువకుడు ఈ ర్యాంకు సాధించినందుకు పలువురు అతడిని అభినందించారు.

ఆరుతడి పంటలను వేసుకోవాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రస్తుతం వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలను వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని రాధా తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని స్థానిక రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బోరు బావుల కింద వరి సాగు చేసుకోవాలని ఇతర ప్రాంతాలలో ఆరుతడి పంటలను వేసుకోవాలని సూచించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ గొన్య నాయక్, డాక్టర్ మాధవి రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినోద్, రజిత, ఆనంద్, రవి, అఖిల రైతులు పాల్గొన్నారు.

12న ఎక్సైజ్ కార్యాలయంలో వాహనాలకు వేలం

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని రాకాసీపేట్ ఎక్సైజ్ కార్యాలయంలో ఈ నెల12న వాహనాలకు వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ సీ.ఐ పవన్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన 4 ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. రాకాసీ పేట్‌లోని తమ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్నవారు ఈ వేలంపాటలో పాల్గొనాలని సీఐ పవన్‌గౌడ్ పేర్కొన్నారు.

మధ్యాహ్నం భోజనం పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు


భోజనాన్ని వడ్డిస్తున్న మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ కొట్టం మనోహర్ తదితరుల పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని హెచ్ఎం శ్రీనివాస్‌కు సూచించారు. పాఠశాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం పరిశీలించిన వారిలో బర్ల రవి, ఉపాధ్యాయులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య


దేవరాజ్ (ఫైల్)

నవతెలంగాణ-దోమకొండ

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ముత్యంపేట గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ఆశబోయిన దేవరాజ్ (23) పని కోసం గత 5 ఏళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్ళాడు. అక్కడ కంపెనీలో పనిలేకపోవడంతో రెండు సంవత్సరాల క్రితం ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద ఉంటూ అప్పుడప్పుడు కారు డ్రైవింగ్‌కు వెళ్తున్నాడు. దుబాయ్ దేశం వీసా కోసం చేసిన అప్పులు తీర్చలేకపోవడంతో మనస్థాపం చెంది తన వ్యవసాయం భూమి వద్ద గల చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు ఆశబోయిన స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య


రాజమణి మృతదేహం

నవతెలంగాణ-ఎడపల్లి

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని జంలం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వంశీకృష్ణారెడ్డి గ్రామానికి చెందిన మీనా రాజమణి (53) అనే వివాహితకు తన కొడుకు మృతిచెంది ఏడాదవుతోంది. అప్పటి నుంచి బాధపడుతున్న ఆమె.. మనస్థాపం చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కడుపు నొప్పితో బాలిక మృతి..?

నవతెలంగాణ-పోతంగల్

కడుపు నొప్పితో బాలిక మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని జల్లాపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దేవసోత్ లలిత, శ్రీను దంపతుల కూతురు ఐశ్వర్య (11) కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోంది. అయితే చికిత్స నిమిత్తం మొదట కోటగిరిలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బోధన్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అక్కడా నయం కాకపోవడంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం


తులసి (ఫైల్)

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల కేంద్రానికి చెందిన తులసి (20) అనే యువతి అదృశ్యమైనట్టు ఆమె తండ్రి మంగళవారం ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జులై 8న ఉదయం 8:45 నిమిషాలకు రోజులాగే యధావిధిగా తులసి ఎల్లారెడ్డిలోని మోడల్ కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి దగ్గర చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. కళాశాలకు వెళ్లి ఆరా తీయగా సోమవారం కళాశాలకు హాజరు కాలేదని తెలియడంతో ఆమె తండ్రి ఆర్వి సంతోష్ ఎల్లారెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో సోమవారం రాత్రి 11 గంటలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారం మేరకు తహసీల్దార్, వీఆర్ఏలతో కలిసి తిరుమలాపూర్ క్రాసింగ్ వద్ద హంగర్గ గ్రామానికి చెందిన 3 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తగు చర్యల గురించి ఆర్‌టిఓకు రిపోర్టు చేసినట్టు వివరించారు.

స్వర్ణకార సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుధాకర్‌చారి


నియామకపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

స్వర్ణకార సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన సుధాకర్‌చారి నియామకమయ్యారు. మంగళవారం బోధన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకటస్వామి, సుధాకర్‌చారికి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మంచోళ్ల రాజమౌళి, రాష్ట్ర సలహాదారులు బ్రహ్మం, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు తంగళ్ల పల్లి శ్రీనివాస చారి, జిల్లా కోశాధికారి అశోక్‌చారి, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కన్నోజ్ వార్ ప్రభాకర్, స్వర్ణకార సంఘం అధ్యక్షులు జనార్దన్‌చారి, కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-బోధన్

వర్షాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలు పండాలని కోరుతూ పట్టణంలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మహాలక్ష్మి ఆలయంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చందూర్ అశోక్, కార్యదర్శి జల్లకొల్ల శ్రావణ్, ఉపాధ్యక్షులు బాంపల్లి సత్యనారాయణ, కోశాధికారి ఇందూర్ కృష్ణ, గొడిల రాములు, శ్రీనివాస్, దండు రవి, దండు నగేష్, ఇందూర్ దేవయ్య, తదితరులు పాల్గొన్నారు.